## క్లుప్తంగా

### గజవాహనంపై ఊరేగిన వెంకటరమణస్వామి



విశేషాలంకరణలో ప్రసన్న వెంకటరమణ స్వామి

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలసిన టీటీడీ అనుబంధ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. ఏకిల దొరవారు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని స్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పూజలు, అభిషేకాలు జరిపారు. బుధవారం రాత్రి ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శేషవాహనంపై స్వామిని ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

### ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ వెంకటేశ్వరస్వామి

ములకలచెరువు : మండలంలోని బురకాయల కోటలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం వేద పండితులు స్వామి వారి విగ్రహానికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.


### విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాలి



శిక్షణాశిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పీలేరు : చదువుతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంచడం ఎంతో అవసరమని గ్రంథాలయాధికారి అమరనాథ్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం, చెస్, క్యారమ్, శాస్త్రీయ నృత్యంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తనం నుంచే స్పోకెన్ ఇంగ్లీష్‌పై పటుత్వం సాధించాలనే ఉద్దేశంతో సులభతరంగా ఇంగ్లీష్ పాఠాలు చెబుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు సంపూర్ణ వికాస అభివృద్ధి కోసం శిక్షణా శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


### అక్రమ నిర్మాణాల తొలగింపు



ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న దృశ్యం

పీలేరు : మండలంలోని మదనపల్లె మార్గం ఇందిరమ్మ కాలనీ సమీపంలో సర్వే నెంబరు 213, 214లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించినట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేసినట్లు సమాచారం అందడంతో అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గురువారం జేసీబీ సాయంతో అక్రమ కట్టడాలు తొలగించారు.

### ముగిసిన మహాభారత యజ్ఞం



దుర్యోధన వధ ఘట్టంలో యుద్ధం చేస్తున్న దుర్యోధన, భీముని వేషధారులు

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత 18 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం గురువారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. మహాభారత యజ్ఞం వద్ద మట్టితో దుర్యోధన ప్రతిమ ఏర్పాటు చేశారు. అక్కడ దుర్యోధన, భీముని వేషధారులు చేసిన యుద్ధ ఘట్టం రక్తి కట్టించింది. దుర్యోధుని వధ అనంతరం ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. దుర్యోధన వధ అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం, అనంతరం రాత్రి ద్రౌపది మాత అగ్ని ప్రవేశం నిర్వహించారు.

# జగనన్న ప్రతి ఆలోచన పేదల కోసమే



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

నిమ్మనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఆలోచన పేదల కోసమేనని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనుక్షణం ఆలోచిస్తారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, సింగల్‌విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జి రమణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలిచిందన్నారు. రెండు పేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. స్థానికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, పార్టీ రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, రవికుమార్‌రెడ్డి, బాబురెడ్డి, షావలి, చక్రపాణిరెడ్డి, చంద్రారెడ్డి, రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామకృష్ణ, తహసీల్దార్ సీఆర్.మంజుల, ఎంపీడీవో లీలామాధవి, అధికార బృందం తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యం**

కేవీపల్లె : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం గర్నిమిట్ట పంచాయతీ పోతిరెడ్డిగారిపల్లె, మోటుపల్లెవాండ్లపల్లె పంచాయతీ రాళ్ల హరిజనవాడ, పెడకంటిపల్లె, ఎస్టీ కాలనీ, నారేవాండ్లపల్లెలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వివరాలు చదివి వినిపించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. రాళ్ల హరిజనవాడలో విద్యుత్ వీధి దీపాలు, తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము నిరంతరం ప్రజలతో ఉంటామని, ఏ సమస్య ఉన్నా పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతోపాటు ఎన్నో సరికొత్త పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబానికి ఏదో విధంగా ఆర్థికంగా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. తమ ప్రభుత్వంలో కులమత, వర్గ భేదాలు లేకుండా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకుండా ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జె శీన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు పొత్తపు సతీష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, వెంకటసిద్దులు, రామకొండారెడ్డి, రవీంద్రరెడ్డి, హరిబాబు, పి. ద్వారకనాథరెడ్డి, మల్లికార్జున, ఆంజినేయులు, మోహన్‌రెడ్డి, గౌస్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 21 నుంచి కోదండరాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కలికిరి: కలికిరి పంచాయతీ పరిధిలోని చెరువు ముందరపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 21న మూల విగ్రహాల ఊరేగింపు, 22న గణపతి పూజ, గోపూజ, 23న ప్రాతఃపూజ, మహాస్నపనం, హోమాది ప్రత్యేక పూజలు, శిఖర కలశ ప్రతిష్ట, మూలమంత్రహోమం, 24న ఉదయం ప్రతిష్టాహోమం, విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం సీతారాముల కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

### నేడు ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆకుల మల్లికార్జున, కైవారం కేఎం.శ్రీనివాసులు సహకారంతో సరిహద్దు రాష్ట్రాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా దిగువకోటలో పురాతన కాలం నాటి శ్రీ కాత్యాయిని విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య శివలింగానికి పంచామృతాభిషేకం, ఏకదశవార రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సేవకులు తెలిపారు.

## సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

మదనపల్లె సిటీ: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ 2023–24 విద్యాసంవత్సరానికి డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోర్సు డైరెక్టర్ ఏటీ రాజు తెలిపారు. డీపీటీ కోర్సుకు పది పాస్, చదువుతున్న విద్యార్థులు, డీపీఎంటీ కోర్సుకు బీఎస్సీ పాస్, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో www.cipet.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ కేటగిరి అభ్యర్థులు రూ.500 చెల్లించాలన్నారు. 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8897995858, 7989660290 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



పర్యావరణ హిత జీవన శైలిపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు చూపుతున్న అటవీశాఖ అధికారులు

మదనపల్లె : ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేలా ముందడుగు వేయాలని అటవీశాఖ మదనపల్లె డివిజన్ డీఆర్వో జె.మదన్‌మోహన్ అన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ హిత జీవన శైలి అనే అంశంపై గురువారం రెడ్డివారిపల్లె సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి మారెప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేంద్రరెడ్డితో కలిసి స్థానికులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పర్యావరణానికి ముప్పు తెచ్చే వ్యర్థపదార్థాలు, ప్లాస్టిక్‌ను నివారించాలని సూచించారు. నీరు, విద్యుత్, పెట్రోలు వంటి వాటిని ఆదా చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని, అటవీ సంపదను సంరక్షించాలని కోరారు. అనుమతి లేకుండా చెట్లను నరికితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు పర్యావరణ హిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం రెడ్డివారిపల్లె సంపద తయారీ కేంద్రం వద్ద అటవీశాఖ అధికారుల మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అధికారులు దీప, శ్రీదేవి, ప్రకాష్, శోభ, ఏబీఓలు కిరణ్, ఉమాదేవి, శేఖర్ పాల్గొన్నారు.

## వందశాతం లక్ష్యాలు సాధించాలి



అతిసార రోగిని పరిశీలిస్తున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కేవీపల్లె : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో వందశాతం లక్ష్యాలు సాధించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంఓ) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ, సీడీ సర్వే, ఆరోగ్యశ్రీలోని ఏఎన్‌ఎం పీడీబ్యాక్, వెక్టార్ కంట్రోల్ హైజీన్ ఆఫ్ ఆర్‌సీహెచ్ పోర్టల్ నిర్వహణ, అనీమియా ముక్త్ భారత్, గ్రామ పారిశుధ్యం, పోషణ, జన ఆరోగ్య సమితి ఖాతా నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ, అతిసారా కేసులు వచ్చే అవకాశం ఉందని, అవసరం మేరకు సెలైన్ బాటిల్స్ స్టాక్ ఉంచుకోవాలని ఆదేశించారు. అతిసారాకు గురైన రోగులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి, హెచ్‌ఈ మహ్మద్‌రఫీ, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వన్‌టౌన్ సీఐగా షేక్ మహబూబ్‌బాషా



మదనపల్లె : పట్టణంలోని వన్‌టౌన్ సీఐగా షేక్ మహబూబ్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న ఈదుర్ బాషా పదోన్నతిలో భాగంగా విజిలెన్స్ శాఖకు బదిలీ కావడంతో దాదాపు 8 నెలలుగా వన్‌టౌన్ సీఐ నియామకం జరగలేదు. టూటౌన్ సీఐ మురళీకృష్ణ వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం సీఐగా బాధ్యతలు స్వీకరించిన షేక్ మహబూబ్‌బాషా గతంలో హైదరాబాదు ఏపీ ఇంటలిజెన్స్, ఎన్‌ఐఏ ఏజెన్సీ న్యూఢిల్లీ, కడప సీసీఎస్, రెడ్‌శ్యాండల్ టాస్క్‌ఫోర్స్‌లో అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది సహకారంతో కృషిచేస్తానని చెప్పారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా సీఐకు ఎస్‌ఐ హరిహరప్రసాద్ పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు.

## రూ. 36 లక్షలతో సిమెంట్ రోడ్లు



గ్యారంపల్లె కురవపల్లెలో చురుగ్గా సాగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె, మఠంపల్లె గ్రామ పంచాయతీలలో రూ. 36 లక్షలతో 16 సిమెంట్ రోడ్లు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ సుబ్రత్ తెలిపారు. మఠంపల్లె పంచాయతీకి రూ. 16 లక్షలతో ఏడు పనులు మంజూరు కాగా ఇప్పటికి నాలుగు నిర్మాణ పనులు పూర్తి అయినట్లు తెలిపారు. గ్యారంపల్లె పంచాయతీకి రూ. 20 లక్షలతో తొమ్మిది పనులు మంజూరు కాగా రెండు పనులు పూర్తయ్యాయన్నారు. పనుల్లో నాణ్యత కొరవడకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టరు సి.కె. యర్రమరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ

పెద్దమండ్యం: గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మదనపల్లె డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. మండలంలోని కలిచెర్ల, పెద్దమండ్యం, ఎన్‌వోపల్లె గ్రామ సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. అలాగే పక్కాగృహాల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పి. జగన్ మోహన్, ఖాదర్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు

**నల్లారిపై ఎమ్మెల్యే చింతల మండిపాటు**



మాట్లాడుతున్న పీలేరు ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి లేదని, మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఒక్కసారి కూడా గెలవలేని వ్యక్తికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. మూడు ప్రాజెక్టుల ద్వారా పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ప్రాజెక్టులను నిర్మిస్తుంటే కిషోర్ కుమార్ రెడ్డి ఓర్వలేక పెద్దిరెడ్డిపై విమర్శలు చేస్తుండడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను చేపడుతుంటే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దుష్ప్రచారం చేయడం తగదన్నారు. టీడీపీ, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, రెడ్డిశేఖర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, అబ్దుల్ కలీమ్, రాయుడు, ఆనంద, షాహెద్, జయచంద్ర, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

### నీటి కష్టాలు తీర్చేందుకే ప్రాజెక్టుల నిర్మాణాలు

**మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి**



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీర్చేందుకే ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టు నిర్మాణాలు జరుగుతున్నాయని పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఉద్దేశించి టీడీపీ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను అభివృద్ధిపథంలో నిలిపేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. పడమటి నియోజకవర్గాలకు సంబంధించి నీటి కరువును తీర్చేందుకు 40 ఏళ్లలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేయలేని పనిని నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రాజెక్టు నిర్మాణాలతో ముందుకెళుతుంటే ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతాలకు మేలు చేయలేకపోయారని, అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం కిషోర్‌కుమార్‌రెడ్డికి తగదన్నారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కిశోర్‌కుమార్ రెడ్డి చేసిన అరాచకాలు అందరికీ తెలుసన్నారు. ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తయి అందుబాటులోకి వస్తే పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బాలగంగాధరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయల్‌మురళీ, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ బాబు

మదనపల్లె : పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కడప ఆర్‌జేడీ బాబు తెలిపారు. గురువారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలవారీ సమీక్షా సమావేశంలో భాగంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఆర్‌జేడీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న విద్యాసంవత్సరంలో అడ్మిషన్లపై చర్చించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్‌ఈపీ–2020) ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి హయ్యర్ ఎడ్యుకేషన్‌లో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. గతంలో మాదిరిగా డిగ్రీలో 3 మేజర్ సబ్జెక్టులు కాకుండా సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌ను చదవాల్సి ఉంటుందన్నారు. ఓ మైనర్ సబ్జెక్ట్ ఆప్షన్ విధానంలో తీసుకోవచ్చన్నారు. లాంగ్వేజెస్, లైఫ్‌స్కిల్, స్కిల్‌డెవలప్‌మెంట్ సబ్జెక్టులు యథాతథంగా ఉంటాయన్నారు. బీటీ కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సంప్రదించి, విద్యార్థుల జాబితాను సేకరించడంతో పాటుగా ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా ఫోన్‌లో సంప్రదిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ అడ్మిషన్లకు జూన్ రెండో వారంలో నోటిఫికేషన్ తర్వాత జూలై–ఆగస్టులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ఉంటాయన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సుధాకరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగశివారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 24న ఊటీకి సమ్మర్ స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ : వేసవి సెలవులను పురస్కరించుకుని 24న ఊటీకి స్పెషల్ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ వన్‌డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 24న రాత్రి మదనపల్లె డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. 25న ఊటీలో బస చేసి అక్కడి ప్రాంతాల్లో తిలకిస్తారన్నారు. 26న కూనూరు హిల్‌స్టేషన్, మెట్టుపాళెం, కోయంబత్తూరు, ఈశా టెంపుల్, ఫలణి సుబ్రమణ్యస్వామి ఆలయం దర్శనం చేసుకుని 27న ఉదయం మదనపల్లెకు చేరుతుందన్నారు. వివరాలకు ప్రయాణికులు 7382875034, 9440858510 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

**26న గోవాకు స్పెషల్ బస్సు :** ఈనెల 26న ప్రముఖ పర్యాటక కేంద్రమైన గోవాకు ప్రత్యేక సర్వీసు నడపనున్నట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. బస్సు 26న మదనపల్లె నుంచి బయలుదేరుతుందన్నారు. తిరిగి 29న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225677 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: స్థానిక శ్రీటీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సరంలో ఐటీఐలో చేరేందుకు అభ్యర్థులు జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపల్ శేషారెడ్డి కోరారు. పది పాసై, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ పోర్టల్‌లో పేర్లు, పూర్తి వివరాలు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9494080339 నంబరులో సంప్రదించాలన్నారు.

### డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు కాలేజీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కలికిరి : మండలంలోని పల్లవోలు గ్రామం పడమటపల్లికి చెందిన గ్రామవలంటీర్ పద్మ భర్త నరేష్(30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తాత్కాలిక సాయంగా రూ.10వేలు నగదు అందచేశారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఎం.వెంకటరమణారెడ్డి(ఎంఆర్‌జీ), పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జుబేర్ అహ్మద్, స్థానిక నాయకులు ఇస్తియాక్ అహ్మద్, జునేద్ అహ్మద్ తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.